# భార్యావిధేయుడు



ఎ.రంగ

"ఆ జగన్నాథరావు మీకెంత స్నేహితుడయినా, అతని బుద్ధి నాకు నచ్చలేదు సుమండీ! బొత్తిగా పెళ్ళాం గీసిన గీటు దాటడట. ఆవిడ పచ్చిమిరపకాయలు తెమ్మంటే పచ్చిమిరపకాయలే తెస్తాడుట. ఆవిడ అల్లం తెమ్మంటే అల్లమే తెస్తాడట. ఆవిడ ఏ సినిమా చూడమంటే అదే చూస్తాడట. ఏం మగవాడండీ! బొత్తిగా సిగ్గు లేదు.

"బంధువుల్ని, స్నేహితుల్ని, అక్కచెల్లెళ్ళని అన్న దమ్ములని మర్చిపోతే మర్చిపోయేడు, జన్మనిచ్చిన తల్లి దండ్రులను కూడా మర్చిపోవడం ఏమిటండీ బొత్తిగానూ... తండ్రి తద్దినానికి కూడా వెళ్ళడట.

"మొన్న సినిమా చూసి వచ్చేటప్పుడు దారే కదాని తిరుమలరావు గారింటికి వెళ్ళాను. పాపం ఆ సీతమ్మ గారి బాధ చెప్పనలవి కాదనుకోండి!

"..'కట్టుకున్న మొగుడు దూరం అయిపోయేడు పసుపూ బొట్టూ లేకుండా చేసి. ఇంటికి పెద్ద కొడుకు బతికి వుండీ దూరం అయిపోయేడు. వాడంటే నాకు పంచ ప్రాణాలూనూ. చిన్నప్పుడు పప్పూ, నెయ్యీ అన్నంలో బెల్లంవేసిన కొత్తిమీరపచ్చడి అన్నా, మిరప్పళ్ళ కొరివికారం అయినా ఎంతో ఇష్టంగా నంచుకు తినే వాడు. కొత్తిమీర వచ్చినంతకాలం కొత్తిమీర పచ్చడి, పప్పూ వండిపెట్టేదాన్ని. ఆఖర్కి వాడికి ఉద్యోగం వచ్చేక కూడా కేరేజీలో కూడా ఎంత హడావిడిగా వున్నా పప్పూ, నెయ్యీ కొత్తిమీర పచ్చడీ మర్చిపోకుండా పెట్టే దాన్ని. వెర్రినాగన్న! ఏం తింటున్నాడో ఏమిటో? పెస రట్టు వేసుకుంటే వాడే జ్ఞాపకం వస్తాడు. బొబ్బట్లు పులిహోర చేస్తే వాడే జ్ఞాపకం వస్తాడు. పోనీ ఆది వారాలప్పుడు వచ్చినా కడుపునిండా వాడికిష్టమైనవి చేసి పెట్టుకుంటాను. అంతకంటే నేనేమి కోరుకున్నాను...' అంటూ సీతమ్మగారు కళ్ళనీరు పెట్టుకుంటే నాకూ కన్నీళ్ళొచ్చేయనుకోండి.

"ఒక్కవంటి తల్లి రాయివంటి బిడ్డలు అన్నారు అందుకే! కొడుకు బిడ్డల తండ్రీ అయినా, ఆ కొడుకు నుంచి ఏమీ ఆశించకుండా, ఆ కొడుక్కి ఇష్టమైనవన్నీ చేసి పెట్టుకోవాలనుకోవడం చూస్తే, ఆవిడ మనస్సు ఎంత గొప్పదో ఆలోచించండి. మీ ఆఫీసే కాబట్టి, మీ స్నేహితుడే కాబట్టి చివాట్లు వేయండి. ఓ ఆదివారం వెళ్ళి చూడమనండి" అంది భర్త చిట్టి పంతులుతో సీతారత్నం.

"అలాగే, అలాగే" అన్నాడు చిట్టి పంతులు.

మర్నాడు లంచ్ టైములో జగన్నాథరావు కుర్చీలోంచి లేచాడు, కాంటీన్‌కి వెళదామని.

ఇంతలో, "టిఫిన్ బాక్సు ఇవ్వలేదేమిటి మీ ఆవిడ ఈ వేళ? మార్నింగ్ షోకి వెళ్ళిందా?" అంటూ జగన్నథరావుని చిట్టి పంతులు పలకరించేడు.

"మామూలే..." అన్నాడు జగన్నాథరావు. "రా! కూర్చో! ఇద్దరం టిఫిన్ చేద్దాం. ఇవేళ మా ఆవిడ బొబ్బట్లు, పులిహోర టిఫిన్ బాక్సులో పెట్టి ఇచ్చింది. ఇద్దరం కలిసి తిని కూడా చాలాకాల మైంది. రా, రా!" అంటూ చిట్టి పంతులు పిలిచేడు.

జగన్నాథరావు వెనక్కు రాక తప్పలేదు. "ఏమిటి విశేషం?" అన్నాడు జగన్నాథరావు కుర్చీలో కూర్చుంటూ.

"విశేషం ఏమీలేదు. మా ఆవిడ పుట్టిన రోజు.అదీ విశేషం" అన్నాడు చిట్టిపంతులు చిన్నగా నవ్వుతూ.

చిట్టి పంతులు మాట్లాడలేదు. గాజు గ్లాసులలో ముందు నీళ్ల పోసేడు. తర్వాత టిఫిన్ బాక్సు తీసి, మూతలో బొబ్బట్లు పులిహోర పెట్టి జగన్నాథరావు ముందుకు తోసేడు. జగన్నాథరావు చేతులు కడుక్కుని వచ్చి బొబ్బట్లు తినటం ప్రారంభించేడు.

"ఓ ఆదివారం వీలు చూసుకుని మీ అమ్మగారిని చూసి రాకూడదుటోయ్? పోనీ మీ ఆవిడ పర్మిషన్ తీసుకునే వెళ్ళు, లేదా ఆవిడనీ తీసుకువెళ్ళు. మీ అమ్మగారు సంతోషిస్తారు. ఏ ఏపిల్ పళ్ళో, బత్తాయి పళ్ళో తీసుకువెళ్ళు, మీ అమ్మగారి ఆనందానికి అవధులుండవు.

"నీ మంచి ఏమీ ప్రతిఫలం ఆశించకుండానే, నీ కింకా ఏవేవో చేసి పెట్టాలనుకుని, చేసి పెట్టి తృప్తి పడాలనుకుంటోంది అంటే, ఆ తల్లి మనసుకంటె గొప్పదైనది ఈ ప్రపంచంలో ఏదైనా వుందిటోయ్!"

"పెసరట్టు వేసుకుంటే నువే జ్ఞాపకం వస్తావుట. ఇంకా ఏం చేసిన నువ్వే జ్ఞాపకం వస్తావుట. ఏదో నోసారి వెళ్ళి చూసిరా! బంధం వున్నంతకాలం బంధం తెంచు కోలేము కదా! నీరాక తప్పించి నీనుంచి ఏమీ కోరటం లేదు ఆవిడ. పెళ్ళాం జేబులు వెతికితే, తల్లి కడుపు వెతుకుతుందిట! నిజంగా ఎంత గొప్ప సామెత! ఎంత అనుభవంతో చెప్పేరు" అన్నాడు చిట్టి పంతులు జగన్నాధరావుతో.

"ఇంతకూ మా అమ్మ దగ్గరకు వెళ్ళి వచ్చేవన్న మాట! ఇంతేనా, ఇంకేమైనా చెప్పిందా మా అమ్మ" అన్నాడు జగన్నాథరావు, పులిహోరలో మిరపకాయ ముక్కలు ఏరి పెడుతూ.

"అబ్బే! నేను వెళ్ళలేదు. మా ఆవిడ మొన్న 'సిరి వెన్నెల' చూసి వస్తూ, దారే కదాని అలా ఓసారి వెళ్ళిం దట మీ ఇంటికి. ఆవిడ అన్నవి, ఈవిడ విన్నవి నాతో చెపితే అంటున్నాను" అన్నాడు చిట్టి పంతులు గ్లాసులో నీళ్ళు తాగుతూ.

"అలాగా! నువ్వే వెళ్ళేననుకున్నాను" అని మళ్ళా "నువూ 'బుల్లెంకమ్మ మొగుడివే'నన్నమాట" అన్నాడు జగన్నాథరావు అదోలా నవ్వుతూ.

"అంటే?" నిజంగానే అర్థంగాక అయోమయంగా అడిగేడు చిట్టి పంతులు, నీళ్ళు అడ్డుపడి గొంతుక పలకమారగా.

"అంటే ఏమీలేదు. నీ అంత నువ్వు నాకు చెప్ప వలసిన నీతులు చెపుతున్నావేమో అనుకున్నాను. కాని నువ్వూ నీ భార్య చెప్పదుమాటలు 'నిని' ('నిని' దగ్గర నొక్కి పలుకుతూ) చెపుతుంటే"- జగన్నాథరావు ఆగి పోయేడు.

చిట్టి పంతులుకి ఎక్కడో 'చుర్రు'మంది. మరి మాట్లాడలేకపోయేడు. ఉన్న నీళ్ళు గడగడా తాగేసేడు.

జగన్నాథరావు చిన్నగా నవ్వుకున్నాడు.